సంక్షేమ పాలనకు నీరాజనం



అరమ పంచాయతీ కేంద్రంలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



వెంకటనగరంలో గ్రామస్తులకు పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

డుంబ్రిగుడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు నీరాజనం పడుతున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని అరమ పంచాయతీ పనసపుట్టు, అరమ గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో 126 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా కొరంజిగుడలో డ్రైనేజీ సమస్యను స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఆయన స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, ఎంపీపీ బాక ఈశ్వరి, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, పంచడి లలిత, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ, సర్పంచ్ ముల్ల, ఉప సర్పంచ్‌లు జగ్గునాయుడు, ఎంపీటీసీలు పద్మ, విజయ, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, నాయకులు శ్రీరాములు, సింహాచలం, కృష్ణారావు, దిశ మహిళ విభాగ నాయకురాలు లీలారాణి, వినోద్, కన్వీనర్లు దలపతి తుమ్‌నాథ్, సునీల్, చిరంజీవి, దేవగున్, సద్దు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం

అడ్డతీగల: ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం తపన పడుతున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని బొడ్లంక పంచాయతీ బొడ్లంక, వెంకటనగరం గ్రామాల్లో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని వర్గాలు అభివృద్ధి బాటలో పయనించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన అందుతోందన్నారు. గిరిజన ప్రాంతాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నారన్నారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, వైస్ ఎంపీపీ కరణం వీరవెంకటరమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: సొవ్వ పంచాయతీలోని మాలివలస, ఒడియావలస గ్రామాల్లో శనివారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు... మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పంచాయతీ కన్వీనర్లు నర్సింగరావు, తిరుపతి, ఉప సర్పంచ్ గాసిరాం తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ సర్వే విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్ చెప్పారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రజా మద్దతు సర్వే పుస్తకాలను కన్వీనర్ సంతప్ కుమార్‌కు నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయానికి శ్రమించిన నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, కన్వీనర్లు, గ్రామ వలంటీర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు అప్పాలు, శివ, తిరుపతి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలసలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, నాయకులు ఆనందరావు, రామకృష్ణ, రామారావు, శంకరరావు పాల్గొన్నారు.

చింతూరు: మండలంలో ఏడుగురాళ్లపల్లి సచివాలయం పరిధిలోని బొడ్డుగూడెం, ఉప్పనపల్లి, పెదశీతనపల్లి సచివాలయం పరిధిలోని బొడ్రాయిగూడెంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్యామల విజయ్‌రెడ్డి, సర్పంచ్ సత్తిబాబు, బాబూరావు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.



సొవ్వలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న కన్వీనర్ నర్సింగరావు



మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌కు ప్రజా మద్దతు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు



పెదవలసలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, నేతలు



బొడ్డుగూడెంలో బ్రోచర్ అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ విజయ్‌రెడ్డి

క్లుప్తంగా

రేపటి నుంచి వెంకన్న కల్యాణ మహోత్సవాలు



మాట్లాడుతున్న రఘునాథ్

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని మే 1 నుంచి నిర్వహించనున్న వేంకటేశ్వర కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ సమర్థి రఘునాథ్ అన్నారు. ఆలయ ప్రాంగణంలో శనివారం ఉత్సవ, ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మే నెలల్లో 1 నుంచి 3వ తేదీ వరకు వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు. సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పలరాం, ఎంపీటీసీ సభ్యులు శత్రుగున్, భీమరాజు, కమిటీ సభ్యులు రామరావు, గుప్త, రమేష్, గంగరాజు, నాగరాజు, చందుపాడి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషి



దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న సాల్మన్‌రాజు తదితరులు

కొయ్యూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుడ్లపల్లి జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామంలో అంబేడ్కర్ ఇండియన్ మిషన్ (అనకాపల్లి) అధ్యక్షుడు సాల్మన్‌రాజు శనివారం పర్యటించారు. దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో అంబేడ్కర్ నూతన విగ్రహం ఏర్పాటుకు సంస్థ తరఫున కృషి చేస్తామన్నారు. మల్లేశ్, ఆదివాసీ హక్కుల నాయకుల కళ్యాణ్, గిరిజన సంఘం నేత సూరిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నాగేశ్వరరావు సేవలు మరువలేనివి



నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట గ్రామానికి చెందిన మండల వైఎస్సార్‌సీపీ నేత, విశాఖపట్నం హిందుస్తాన్ షిప్‌యార్డు రిటైర్డు మేనేజర్ మండి నాగేశ్వరరావు మృతి చెందారు. ఈ సందర్భంగా పాడేరు డివిజన్ విశ్రాంత ఉద్యోగ సంఘ సభ్యులు మృతుడు నాగేశ్వరరావు చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయమందించారు. నాగేశ్వరరావు చేసిన సేవలను గుర్తు చేశారు. సంఘం ప్రతినిధులు ప్రసాదరావు పడాల్, మోహన్‌రావు, రామదాసు, మోదకొండ, తిరుపతిరావు, గున్నమ్మ తదితరులున్నారు.

108 సేవలపై అవగాహన



చిక్కాపుగడ్డలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అడ్డతీగల: ఆపద సమయంలో అక్కరకు వచ్చే 108 వాహనం సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అంబులెన్స్ సిబ్బంది గిరిజనులకు అవగాహన కల్పించారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ రామకృష్ణ, పైలెట్ నవాజ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని చిక్కాపుగడ్డ తదితర గ్రామాల్లో గిరిజనులకు 108 సేవలపై అవగాహన కల్పించామన్నారు. ప్రమాదాలు జరిగినా అనారోగ్య పరిస్థితుల్లో అత్యవసర వైద్యం అవసరం అయినా వెంటనే 108 వాహనానికి ఫోన్ చేసి తెలియజేస్తే వాహనం అందుబాటులోకి వస్తుందన్నారు.ఆ శ వర్కర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి గ్రామాల్లో సర్వే

వీఆర్ పురం: ఉన్నతాధికారుల దేశాల మేరుకు మండలంలో గ్రామాల్లో ప్రయారిటీ హాబిటేషన్ కింద 3 నుంచి వాల్యూయేషన్ సర్వే ప్రక్రియ ప్రారంభించనున్నట్టు తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ కట్టడాల విలువ అంచనాల నిమిత్తం హౌసింగ్, ఆర్‌అండ్‌బీ శాఖల అసిస్టెంట్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో సిబ్బందికి ఏక కాలంలో శిక్షణ ఇచ్చి, వాల్యూషన్ ప్రక్రియ చేపడతామన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ వాల్యూషన్‌లో ఒక భాగమని, సదరు ప్రక్రియతోపాటు కట్టడములకు విలువ కట్టి అంచనా నిర్వహిస్తామని, లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. ఈ విషయం ప్రజాప్రతినిధులకు తెలియజేస్తామన్నారు.

తహసీల్దార్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

వై.రామవరం: మండల తహసీల్దార్‌గా సీహెచ్.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటివరకు అడ్డతీగల తహసీల్దార్‌గా పనిచేసి, డిప్యుటేషన్‌పై వై.రామవరం తహసీల్దార్‌గా వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎ.తాతారావు అడ్డతీగల తహసీల్దార్‌గా డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరావు సిబ్బందిని పరిచయం చేసుకుని, విధుల నిర్వహణపై సలహాలు సూచనలు ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర్, ఆర్‌ఐ తాతారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

గృహ లబ్ధిదారులకు అవగాహన

అనంతగిరి: మండలంలోని జీనబాడు, రొంపల్లి పంచాయతీల్లో హౌసింగ్ ఏఈ టి.నాగేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామీణ గృహ నిర్మాణం పథకం ద్వారా గృహాలు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన గృహ నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. హౌసింగ్ డీఈఈ మోహన్ ఆదేశాల మేరకు మండలంలో మంజూరైన 1115 గృహాలకు సంబంధించి పనులపై సర్వ చేపడుతున్నామన్నారు. పనుల బిల్లుల చెల్లింపులు వెనువెంటనే జరుగుతున్నాయని, లబ్ధిదారులు పనులు ప్రారంభించాలని కోరారు. సచివాలయం సిబ్బంది తదితరులున్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు



పాడేరులో చలివేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు మజ్జిగను పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పక్కన నాయకులు

సాక్షి, పాడేరు: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని పాడేరు ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఎదుట చలివేంద్రాన్ని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. సురక్షిత తాగునీటితో పాటు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్, ఐటీడీఏ ప్రాంతాల్లో చలివేంద్రాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వేసవి కాలం ముగిసే వరకు చలివేంద్రం సేవలు కొనసాగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షురాలు ఎం.సరస్వతి, వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కె.సూరిబాబు, డైరెక్టర్ రామ సత్యవతి, ఎంపీటీసీ చిట్టెమ్మ, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, సర్పంచ్‌లు సన్నిబాబు, సీతమ్మ, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.కన్నాపాత్రుడు, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర పాస్టర్ బాబూరావు, సచివాలయం కన్వీనర్లు నాగేంద్ర, నరేష్, మోదమ్మ ఉత్సవ కమిటి కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల/చింతపల్లి: జి.మాడుగుల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద, చింతపల్లి మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. జి.మాడుగులలో వైఎస్సార్‌టీఏఫ్ రాష్ట్ర కార్యదర్శి మత్స్యరాస మత్స్యరాజు, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీలు విజయకుమారి, సన్యాసిదొర, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ గాయత్రి, మండల కన్వీనర్ కళ్యాణ్, నాయకులు చిట్టిబాబు, వలసయ్య, మత్స్యంనాయుడు, ప్రకాష్‌నాయుడు, వార్డు నెంబర్ మణి, శ్రీనివాస్‌నాయుడు, చింతపల్లిలో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య, మండల పార్టీ అధ్యక్షులు రవి, సర్పంచ్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం



సీహెచ్‌సీలో సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూనవరం: అగ్నిప్రమాదాల పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన ఉండాలని అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో అగ్ని ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో గ్యాస్ లీకైతే తీసుకోవలసిన జాగ్రత్తలను, ఫైర్ సిలండర్లు ఉపయోగించే విధానాన్ని వివరించారు. ప్రమాదాలు జరిగే సమయంలో భయపడకుండా వాటిని ఎలా ఎదుర్కోవాలో చెప్పారు. ప్రమాదాలను నివారించడంలో పలు సూచనలు ఇచ్చారు. ఎల్ఎఫ్ఎం వెంకటరావు, డీఓపీ పీరవి, సిబ్బంది బాలాజీ, ఆర్.శ్రీను, వైద్యాధికారులు వంశీ, రమ్య, హెడ్ నర్స్ బుజ్జి, వైద్య సిబ్బంది అనసూయ, రాజు, జోగారావు, వెంకన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కన్నతండ్రితో కలిసి కట్టుకున్న వాడిని కడతేర్చింది

- పోలీసుల అదుపులో భార్య, మామ

చోడవరం రూరల్: కన్నతండ్రి, మరికొందరి సహకారంతో కట్టుకున్న భర్తనే కడతేర్చిన భార్య దురాగతం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులకు చెందిన రుద్రాక్ష హరి విజయ్ తన భార్య ప్రీతితో కలసి స్థానిక మారుతీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. చిన్నపాటి ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ కుటుంబపోషణ చేసుకుంటున్నాడు. వారితో పాటు ప్రీతి తండ్రి శంకరరావు కూడా ఉంటున్నాడు. ప్రీతి ప్రవర్తనపై భర్త విజయ్‌కు అనుమానం కలగడంతో వారి కాపురంలో కలతలు చోటుచేసుకున్నాయి. ఈ నెల 17న రాత్రి మామ శంకరరావు మరికొందరు కలసి హరి విజయ్‌తో మద్యం తాగించి.. ఆ మత్తులో ఉండగా అతనిని హతమార్చారు. ఇదంతా భార్యకు తెలిసే జరిగినట్టు సమాచారం. అదే రోజు రాత్రి మృతదేహాన్ని జి.మాడుగులకు తరలిస్తుండగా నాకాబందీ చేస్తున్న పాడేరు పోలీసులు వారిని ప్రశ్నించారు. తన భర్త గుండెపోటుతో బాధపడుతున్నారని, స్వగ్రామానికి తరలిస్తున్నామని ప్రీతి చెప్పింది. అయితే పోలీసులు వారిని అనుమానంతో వెంబడించారు. ప్రాణం పోయిన హరి విజయ్‌ను జి.మాడుగుల వైద్యులకు చూపించగా.. వారు మృతుడు గుండెపోటుతో కాకుండా, ఊపిరి ఆడకుండా చేయడం వల్ల మరణించినట్టు స్పష్టం చేశారు. దీంతో భర్తను హతమార్చిందన్న అభియోగంతో కేసు నమోదు చేసి చోడవరం పోలీసులకు అప్పగించారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావును ఈ కేసు గురించి వివరణ కోరగా భార్య ప్రీతి తన తండ్రితో కలసి హతమార్చినట్టు తేలిందని, కేసు పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు. మృతుడి భార్య, మామ తమ అదుపులోనే ఉన్నారని, ఇతరుల ప్రమేయం పట్ల పూర్తి దర్యాప్తు కొనసాగుతుందని చెప్పారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

అనంతగిరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభ్యసించి, ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సునంద శనివారం తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఇంటర్ కమిషన్ ఆదేశాలతో తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మే 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, అవసరమైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా రామన్నదొర

రంపచోడవరం: రంపచోడవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) పర్సన్ ఇన్‌చార్జిగా జల్లేపల్లి రామన్నదొర శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎల్లవరం వెళ్లి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతర ఉదయభాస్కర్(అనంతబాబు)ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాల సమస్య పరిష్కరించాలి

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ సర్పిపుట్టు గ్రామంలో ఎంపీపీ పాఠశాల భవన సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు రామారావు, భగ్‌వాన్, బాబూరావు, లైకోన్ తదితరులు కోరారు. శనివారం కురిసిన భారీ వర్షానికి విద్యార్థులు ఇబ్బందులుపడ్డారు. భవనం పైకప్పు రేకులు పాడయ్యాయని, గదుల్లో వర్షపు నీరు కారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి భవనం సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



చింతపల్లిలో పరీక్షకు హాజరైన విద్యార్థులు



పరీక్షకు హాజరైన విద్యార్థులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పోలీసు బందోబస్తు మధ్య పకడ్బందీగా నిర్వహించారు. పరీక్షకు 264 మందికి గాను 124 మంది మాత్రమే హాజరైనట్టు ప్రిన్సిపల్ శ్రీపాద రామకృష్ణ తెలియజేసారు.

కూనవరం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన నవోదయలో ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కూనవరం, విఆర్ పురం, చింతూరు, ఎటపాక మండలాలకు చెందిన మొత్తం 204 మంది (తెలుగు మీడియం) విద్యార్థులు పరీక్షకు హాజరు కావల్సి ఉండగా 163 మంది హాజరయ్యారని, 41 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ చిచ్చడి బాబురావు తెలిపారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్ శోభన్‌బాబు వ్యవహరించారు. కాగా ఎంఈవో బాలరాజు పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు.

కొయ్యూరు/చింతపల్లి/రాజవొమ్మంగి: కొయ్యూరు, చింతపల్లి, రాజవొమ్మంగిలో జరిగిన నవోదయ పాఠశాలలో ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. కొయ్యూరులో 155 మందికి 147 హాజరైనట్టు ఎంఈవో బోడంనాయుడు తెలిపారు. విశాఖ నవోదయ సెంట్రల్ పరిశీలకుడు శ్రీధర్ పర్యవేక్షించారు. చింతపల్లిలో జరిగిన పరీక్షలో 275 మందికి గాను 231 హాజరైనట్టు ఎంఈవో తెలిపారు. రాజవొమ్మంగిలో జరిగిన పరీక్షలో 252 మందికి గాను 126 మంది హాజరైనట్టు ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు.

ఏకలవ్యలో ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సత్యవేణి

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించనున్న ఏకలవ్య పాఠశాలలో ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తయినట్టు ప్రిన్సిపాల్ సత్యవేణి తెలిపారు. కేంద్రంలో 513 మంది పరీక్ష రాయనున్నారని, ఇందుకోసం 22 గదులు కేటాయించామని, 25 మంది ఇన్విజలేటర్లు నియమించినట్టు పేర్కొన్నారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా స్థానిక ఏకలవ్య పాఠశాల ప్రిన్స్‌పాల్ ఎం.వి.కృష్ణారావు, అబ్జర్వర్‌గా క్రాంతిరోజ్ వ్యవహరిస్తారన్నారు. పరీక్షకు గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

పాజిటివ్ కేసు నమోదు

రాజవొమ్మంగి: మండలంలో గురువారం ఒకరికి కోవిడ్ పాజిటివ్ నమోదైనట్టు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లిఖిత తెలిపారు. మొత్తం ముగ్గురికి ర్యాపిడ్ టెస్టులు చేశామన్నారు. తంటికొండ గ్రామానికి చెందిన ఒకరికి పాజిటివ్ వచ్చిందన్నారు.


గిట్టుబాటు ధర కల్పించాలి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం వారపు సంతలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ర్యాలీ నిర్వహించారు. సంఘం నేత శ్రీను మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. దళారుల మోసాలను అరికట్టాలన్నారు. భీమరాజు, లైకోన్, డోంబ్రు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బైబిల్ పాఠశాల

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని బెరాకా ప్రార్థన మందిరంలో 1 నుంచి 6వ తేదీ విరామ బైబిల్ పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పాస్టర్ స్టీఫెన్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ క్రీస్తు బోధనలు, సువార్త, ప్రత్యేక ప్రార్థనలు తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, భోజన సదుపాయం కల్పించినట్టు చెప్పారు.

మేడే వారోత్సవాలపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం ప్రతినిధి రమణ

వై.రామవరం: మేడే వారోత్సవాల్లో భాగంగా మే ఒకటవ తేదీ నుంచి 7వ తేదీ వరకు మండలంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఐవీ రమణ పిలుపునిచ్చారు. మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో నిర్వహించే మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని కార్మిక సంఘాలు, కార్మికులు హాజరుకావాలని ఆయన కోరారు. శనివారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి విస్తృత ప్రచారం చేశారు.